# పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

- ఎస్పీ యోగేశ్ గౌతమ్
- ఊట్కూర్ పోలీస్‌స్టేషన్ పరిశీలన

ఊట్కూర్, డిసెంబర్ 7 : పోలీస్ వ్యవస్థపై నమ్మకం కలిగేలా సిబ్బంది పనితీరు ఉండాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ అన్నారు. ఊట్కూర్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోలీస్ శాఖ అత్యంత బాధ్యతాయుతమైన వ్యవస్థ అని ప్రతిఒక్కరూ విధులను అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. బాధితుల ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దని, ఫిర్యాదు అందిన వెంటనే పరిష్కరించి వారికి తగిన న్యాయం చేయాలని ఆదేశించారు. సమాజంలో మహిళలపై అఘాయిత్యాలు, దోపిడీలు, దొంగతనాలు, నేర ప్రవృత్తిని నియంత్రించేందు కు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. భౌతిక సాక్ష్యంతోపా టు సాంకేతిక



స్టేషన్ గదులను పరిశీలిస్తున్న ఎస్పీ



ఊట్కూర్‌లో పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్

పరిజ్ఞానాన్ని జోడించి కోర్టులో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో 5ఎస్ ఇంప్లిమెంటేషన్‌ను అమలు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిరాద్యు దారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఆర్థిక నేరాలను కట్టడి చేసేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటుకు ప్రజలను చైతన్యం చేయాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు 1930, డయల్ 100పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. సిబ్బందికి ఎటువంటి సమస్యలు ఉన్నా తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రామ్‌లాల్, ఎస్సై గోకరి తదితరులు పాల్గొన్నారు.

# విలువ జోడింపుతోనే వ్యవసాయం లాభసాటి

- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సురేశ్‌కుమార్
- పెబ్బేరులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సురేశ్‌కుమార్

పెబ్బేరు, డిసెంబర్ 7 : పెట్టుబడులు తగ్గించుకొని వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి మంచి ధరలకు అమ్ముకొంటేనే రైతు మనుగడ సాధ్యమని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సురేశ్‌కుమార్ అన్నారు. పెబ్బేరులో నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాకృతిక రైతు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని ప్రజలు ఎక్కువగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధార పడ్డారన్నారు. పలు కారణాల వల్ల రైతులు సరైన లాభాలను ఆర్జించని పరిస్థితి ఉన్న నేపథ్యంలో పెట్టుబడులు తగ్గించుకొంటేనే పరిస్థితి గాడిన పడుతుందన్నారు. అందుకే వ్యవసాయానికి సరికొత్త పద్ధతులను అవలంబించాలని సూచించారు. ముఖ్యంగా సేంద్రియ సాగు, మిశ్రమాలు, కషాయాల తయారీ వైపు దృష్టి మళ్లించాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న రైతులు తమ అనుభవాలను రైతుల తో పంచుకున్నారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ మేనేజర్ ప్రసాద్, రైతులు నారాయణ, రమణారెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంచి పౌరులుగా ఎదిగినప్పుడే ఉత్తమ భవిష్యత్

- జిల్లా మహిళా సాధికారిత కేంద్రం అధికారిణి శ్రీవాణి




గోపాల్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో- బేటీ పడావోపై అవగాహన కలిగిస్తున్న శ్రీవాణి

గోపాల్‌పేట, డిసెంబర్ 7 : విద్యార్థులు సమాజంలో మంచి పౌరులుగా ఎదిగినప్పుడే వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం అధికారిని శ్రీవాణి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'బేటీ బచావో- బేటీ పడావో, బాలికలను రక్షిద్దాం–బాలికలను చదివిద్దాం' అనే అంశంపై గురువారం అవగాహన కా ర్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌమార దశలో విద్యార్థులు అనేక ఒడిదుడుకులకు లోనవుతారని, అందుకు వయసుతో పాటు వచ్చే మార్పులే కారణమన్నారు. ఫోన్ల ద్వారా సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని, వారికి ఏదైనా సమస్య తలెత్తితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రాజు, ఉపాధ్యాయులు ఎండీ హమీద్, శేషయ్య, యాదగిరి, పరమేశ్వరాచారి, బాల చెన్నయ్య, సైదుద్దీన్ పాల్గొన్నారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలు

జడ్చర్లటౌన్, డిసెంబర్7 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జడ్చర్లలోని బాదేపల్లి జెడ్పీహైస్కూల్ మైదానంలో శుక్రవారం నుంచి అండర్–17 విభాగంలో 67వ రాష్ట్రస్థాయి బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమవుతున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు, పాఠశాల జీహెచ్‌ఎం చంద్రకళ, పీఈటీలు మొయిన్, కృష్ణయ్య, శారదాబాయి, వడెన్న తెలిపారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు రాష్ట్రంలోని 10ఉమ్మడి జిల్లాల తరపున బాలబాలికల జట్లు పాల్గొంటు న్నాయన్నారు. ఒక్కో జిల్లా నుంచి 40మంది క్రీడాకారులు చొప్పున హాజరు కానున్నట్లు తెలిపారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న బాలుర జట్లకు స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్, బాలికలకు సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో భోజనం, వసతి కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

- వృథాగా పోతున్న నీరు

పెద్దమందడి, డిసెంబర్ 7: మండలంలోని దొడగుంటపల్లి గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్ద పైప్ లైన్ లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతుంది.గురువారం ఉదయం నుంచి లీకేజీ అవుతున్న ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి వాటర్ లీకేజీలు మరమ్మతులు చేపట్టి నీటి సమస్యలు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన వనపర్తి విద్యార్థులు

## రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు వనపర్తి విద్యార్థులు

వనపర్తి టౌన్, డిసెంబర్ 7 : వరంగల్ జిల్లాలోని జీడబ్ల్యూఎం ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు వనపర్తికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు కరాటే మాస్టర్ శేఖర్ తెలిపారు. వనపర్తి జిల్లా నుంచి గుజారియో కరాటే అండ్ కిక్ బాక్సింగ్ అకాడమీ విద్యార్థులు అండర్–7,8,9 విభాగాల్లో మల్లేశ్, లౌక్య, అండర్–10,11,12విభాగాల్లో రుద్ర, మోక్షిత, సిద్దార్థ, అనన్య, అండర్–13,14,15 విభాగంలో ప్రవీణ్, దేవరాజ్, ఝాన్సీ, యోగి, శివకృష్ణ, మిస్బా, అండర్–16, 17, 18 విభాగంలో చంద్రకాంత్, కీర్తన, రేణుక, తిరుమలేశ్ పాయింట్ వైస్, కిక్‌లైట్ మ్యూజికల్ ఫామ్, మ్యూజికల్ వెపన్ విభాగాల్లో పోటీపడనున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వి ద్యార్థులను గుజారియో కరాటే అండ్ కిక్ బాక్సింగ్ అకాడమీ మాస్టర్, తె లంగాణ రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కరాటే శేఖర్, సీని యర్ విద్యార్థులు శివకృష్ణ యాదవ్, వరుణ్ అభినందించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, డిసెంబర్ 7 : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ సేవలందించిన దివ్యాంగులు, సంస్థ సభ్యులను సన్మానించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రామమహేశ్వర్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికి గానూ ఉత్తమ ఉద్యోగులు, ఉత్తమ స్వయం ఉపాధి గల వారు, ఉత్తమ వ్యక్తిగత సామాజిక సేవలు అం దించిన వారు, ఉత్తమ క్రీడాకారులు, ఉత్తమ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఉత్తమ ఉద్యోగాలు కల్పించిన వారు, ఉత్తమ సౌకర్యాలు కల్పించిన వారు, ఉత్తమ సంస్కృతిక నైపుణ్యం గలవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హుల న్నారు. ఈనెల 10 లోపు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని, అలాగే wdsc. telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

## జోరుగా కొనుగోళ్లు

నారాయణపేట టౌన్, డిసెంబర్ 7 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ధాన్యం క్రయవిక్రయాలు జోరుగా కొనసాగాయి. 307 క్వింటాళ్ల హంసరకం ధాన్యం విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ. 2,930, కనిష్ఠంగా 1,720 ధర పలికింది. 4,154 క్వింటాళ్ల సోనారకం ధాన్యం విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.3,302, కనిష్ఠంగా రూ. 1,666 ధర పలికింది. 413 క్వింటాళ్ల ఎర్రకందులు విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.11, 555, కనిష్ఠంగా 10,555 ధర పలుకగా, 213 క్వింటాళ్ల తెల్లకందులు విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ. 11,552, కనిష్ఠంగా రూ. 10,600 ధర పలికినట్లు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.

## హరితహారం మొక్కలు దగ్ధం



అగ్నికి ఆహుతైన హరితహారం మొక్కలు

కృష్ణ, డిసెంబర్ 7 : అధికారుల నిర్లక్ష్యంతో హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతైన ఘటన మండలంలోని గుడేబల్లూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ముడుమాల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన చోటు చేసుకుంది. పల్లెలు, పట్టణాలు పచ్చగా ఉండాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. అయితే కొన్ని రోజులుగా రోడ్డు పక్కన పొలాల్లో గడ్డి వాములకు నిప్పుపెట్టడంతో వాటి నుంచి నిప్పురవ్వలు హరితహారం మొక్కలపై పడి దగ్ధమవుతున్న అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.